క్లుప్తంగా

నేటి నుంచి 144 సెక్షన్ అమలు

సీఐ బాలకృష్ణ

గురజాల : ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని పట్టణ సీఐ టి.బాలకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని గ్రామాల్లో అక్కడక్కడ చెల్లాచెదురు ఘటనలు జరిగాయని ఫలితాలు వెలువడిన తరువాత అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. అత్యవసరమైన పాలు, మెడికల్ వంటి వాటికి మాత్రమే మినహాయింపు ఉందన్నారు. గుంపులుగా జనాలు ఉండకూడదన్నారు. రెచ్చగొట్టే విధంగా ఎవరూ మాట్లాడరాదన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బి.అనంత కృష్ణ, సుందర్ రాజన్ తదితరులున్నారు.

5వ తేదీ వరకు 144 సెక్షన్

కారెంపూడి: పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు మండలంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని తహసీల్దార్ జయవర్ధన్, కారెంపూడి ఎస్‌ఐ అమీర్ శుక్రవారం తెలిపారు. ప్రజలు బయటకు వచ్చే పరిస్థితులను తగ్గించుకోవాలని కోరారు. ప్రజలు తమకు కావాల్సిన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటికే అమలులో ఉన్న 144 సెక్షన్ కారణంగా షాపులు తీయకుండా వ్యాపారులు సహకరిస్తున్నారని, ప్రజలు కూడా శాంతి భద్రతల పరిరక్షణకు చట్టానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 144 సెక్షన్ 5వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ముగ్గురు కంటే ఎక్కువగా ఒక చోట గుమికూడి ఉండకూడదని హెచ్చరించారు.

27 మద్యం సీసాలు స్వాధీనం

రెంటచింతల: మండలంలోని మల్లవరం గ్రామంలో ఓ బెల్ట్‌షాపులో తనిఖీలు నిర్వహించి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ ఖాసిం బెల్ట్ షాపును నిర్వహిస్తుండగా అతని వద్ద 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాలలో ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహించినా సమాచారం పోలీసులకు తెలిపాలని.. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలోని నరమాలపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు అలాగే విద్యుత్ లైన్ల రిపేరు నిమిత్తం నరమాలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ మండల ఏఈ కె.కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. నరమాలపాడు, వైకుంఠపురం, మిరియాల గ్రామాల ప్రజలు, రైతులు గమనించాలని ఏఈ కోరారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి వారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు యండపల్లి సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించటంతో పాటు అభిషేకాలు చేయనున్నట్లు తెలిపారు. స్వామి వారికి భక్తులు మొక్కుబడులు చెల్లించుకుంటారన్నారు. దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయటం జరుగుతుందన్నారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన మరోలారీ

ఢీకొట్టిన లారీ డ్రైవర్‌కు గాయాలు



చిలకలూరిపేటటౌన్: నిద్ర మత్తుతో ముందు వెళుతున్న లారీని మరో లారీ ఢీకొన్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న వెళుతున్న లారీ రూరల్ మండలంలోని తాతపూడి గ్రామం హైవే వద్దకు రాగానే డ్రైవర్‌కు నిద్ర ఆవహించింది. దీంతో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ ముందుభాగం ధ్వంసం కాగా, ఆ లారీ డ్రైవర్ గంధం భోగేశ్వరరావుకు గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న చిలకలూరిపేట 108 సిబ్బంది సంఘటనా స్థలాన్ని చేరుకుని బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గురజాలలో లెక్కింపు ఇలా..

- నియోజకవర్గంలో 304 పోలింగ్ బూత్‌లు
- 22 రౌండ్లలో తేలనున్న గురజాల ఫలితం
- ఒక్కొక్క రౌండ్‌లో 14 బూత్‌లు
- పోస్టల్ బ్యాలెట్‌కు 2 టేబుళ్లు



గురజాల : మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టం ముగిసింది. ఓటర్లు గత ఎన్నికల కన్నా అధికంగా పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 నాటి కన్నా 2024లో ఓటింగ్ శాతం పెరిగింది. నేతల తలరాతలను ఓటర్లు ఈవీఎంలలో భద్రపరిచారు.

నియోజకవర్గంలో 304 పోలింగ్ బూత్‌లు

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో మొత్తం 304 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వాటిలో గురజాల-62 , దాచేపల్లి-78, మాచవరం-50, పిడుగురాళ్ల రూరల్-61, పిడుగురాళ్ల అర్బన్‌లో-53 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 304 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.

22 రౌండ్లలో పూర్తి

గురజాల నియోజకవర్గంలోని 304 పోలింగ్ బూత్‌లకు గాను మొత్తం 22 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. ఒక్కొక్క రౌండ్‌లో 14 బూత్‌లు లెక్కింపు చేయడం జరుగుతుంది. పోస్టల్ బ్యాలెట్‌లో 2,106 ఓట్లు, సర్వీస్ ఓటర్లు కింద 153 మందికి ఇవ్వగా.. నేటి వరకు 63 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు లెక్కింపుకు రెండు టేబుళ్లు ఏర్పాటు చేశారు.

గురజాలలోనే అత్యధికం

పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గురజాలకు ప్రాధాన్యత ఉంది. గురజాల నియోజకవర్గంలో 2,73,971 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ బూత్‌ల సంఖ్య 304, కౌంటింగ్ రౌండ్లు 22. గురజాల నియోజకవర్గంలోనే అత్యధికంగా ఓటర్లు, పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2,73,971 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,33,353 మంది పురుషులు, 140576 మంది స్త్రీలు, 42 మంది ఇతరులు ఉన్నారు. వారిలో 2,30,945 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,12,704 మంది పురుషులు, 1,18,219 మంది స్త్రీలు, 22 మంది ఇతరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

2వ రౌండ్‌లో అత్యధికం

గురజాల నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాలలో 22 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. అత్యధికంగా 2వ రౌండ్‌లో 11,842 ఓట్లు, రెండవ స్థానంలో 13వ రౌండ్‌లో 11,359 ఓట్లు, అత్యల్పంగా 22వ రౌండ్‌లో 8,688 ఓట్లు లెక్కింపు జరగనున్నాయి. గురజాల మండలంలోని గొట్టిముక్కల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. చివరగా పిడుగురాళ్ల అర్బన్‌లోని పులిచింతల ప్రాజెక్టు పోలింగ్ కేంద్రంతో ముగియనుంది.

గురజాల నియోజకవర్గంలోని రౌండ్ల వారీగా కౌంటింగ్ ఇలా...

రౌండ్	పోలింగ్ కేంద్రాలు	లెక్కించే ఓట్లు
1	1-14	10,569
2	15-28	11,842
3	29-42	10,583
4	43-56	11,106
5	57-70	11,311
6	71-84	9,518
7	85-98	8,768
8	99-112	10,979
9	113-126	10,598
10	127-140	10,539
11	141-154	11,212
12	155-168	9,056
13	169-182	11,359
14	183-196	11,164
15	197-210	10,887
16	211-224	10,112
17	225-238	10,216
18	239-252	10,609
19	253-266	11,205
20	267-280	10,774
21	281-294	9,849
22	295-304	8,688

గ్రామాలలో హింసాత్మక ఘటనలకు తావులేదు

డీఎస్పీ వెంకటేశ్వర్లు



జెట్టిపాలెం గ్రామంలో ప్రత్యేక దళాలతో డ్రిల్ చేయిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో గ్రామాలలో హింసాత్మక ఘటనలకు తావులేదని ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి అల్లర్లకు దూరంగా ఉండి పోలీసులకు పూర్తిగా సహకరించాలని.. ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం కలిగించేందుకే కవాతు (ఫ్లాగ్‌మార్చ్) నిర్వహిస్తున్నామని డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో 80 మంది ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు భరోసా కలిగించేందుకు, మనో ధైర్యం కల్పించడానికి, ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో బాణసంచా కాల్చరాదని.. ఎలాంటి ఉత్సవాలు జరపరాదన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడేవారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు, ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



వంటలను రుచి చూస్తున్న స్టేట్ అబ్జర్వర్ కృష్ణకుమారి

వెల్దుర్తి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని స్టేట్ అబ్జర్వర్ కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వారికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ మెనూను రుచి, శుచితో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలన్న లక్ష్యానికనుగుణంగా అందరూ సమష్టిగా పనిచేయాలని ఆమె కోరారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించటంలో ఎండీఎం నిర్వాహకులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వీటితో పాటు వేరుశనగ చిక్కీలు, బెల్లం రాగి జావ, తయారు చేయటంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల మిడ్ డే మీల్స్ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించివారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ పూర్ణచంద్రరావు, సీఆర్‌పీలు పి.శ్రీను, వెంకయ్య, వెంకటేశ్వర్లు, ఎండీఎం సిబ్బంది తదితరులున్నారు.

భగ్గుమంటున్న ఎండలు



రెంటచింతలలో నిర్మానుష్యంగా ఉన్న మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి

రెంటచింతల: రాష్ట్రంలోనే వేసవిలో ప్రతి ఏటా అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతాలలో ఒకటైన రెంటచింతలలో భగభగమంటున్న ఎండలకు ప్రజలు హడలిపోతున్నారు. శుక్రవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 46.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 32.4 డిగ్రీలుగా నమోదైంది. గ్రామంలో బుధ, గురు, శుక్రవారాలలో 43.6, 45.7, 46.6 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో పాటు వడగాలులకు భయపడి ప్రజలు బయటకు రాకపోవడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో ఇక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రత 49 డిగ్రీలుగా నమోదైన చరిత్ర ఉంది. భానుడి ప్రతాపానికి వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు.

మగ్గం వర్క్‌లో మహిళలకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు పొందిన వారితో యూనియన్ బ్యాంకు డైరెక్టర్ బ్రహ్మానందంకుమార్

సత్తెనపల్లి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్, యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో మహిళల స్వయం ఉపాధికై మగ్గం వర్క్‌పై తర్ఫీదు ఇచ్చారు. 30 రోజుల పాటు ఈ తర్ఫీదు పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. దళిత బహుజన రిసోర్స్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందం కుమార్ మాట్లాడుతూ మహిళలు వారి కుటుంబ అభివృద్ధికి తోడ్పడే విధంగా వారి జీవనోపాధిని మెరుగుపరుచుకొని కుటుంబానికి సహాయంగా ఉండాలన్నారు. ఫ్యాకల్టీ రాజశేఖర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ సహాయంతో చిన్న చిన్న యూనిట్లు పెట్టుకొని కావలసిన మెటీరియల్స్‌కు త్వరలో బ్యాంకు ద్వారా లోన్ ఇప్పించి వారి జీవనోపాధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మగ్గం వర్క్ నేర్చుకున్న మహిళలు పాల్గొన్నారు.


విద్యా రంగానికి జడ్‌ఎస్ సేవలు ఎనలేనివి



డీఐఈవో నీలావతిదేవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు దంపతులు, అధ్యాపకులు

సత్తెనపల్లి: విద్యా రంగానికి సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జడ్‌ఎస్ రామచంద్రరావు ఎనలేని సేవలు అందించారని ఆర్జేడీ వి.సుబ్బారావు, డీఐఈవో ఎస్.నీలావతి దేవిలు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన జెడ్ఎస్ రామచంద్రరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ కెటీటీ వెంకటరమణ అధ్యక్షతన రామచంద్రరావు పదవీ విరమణ సభ నిర్వహించారు. ఈ సభలో వారు ముఖ్య అతిథులుగా హాజరై రామచంద్రరావు సేవలను కొనియాడారు. అనంతరం రామచంద్రరావును పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే ఆర్జేడీ వి.సుబ్బారావు, డీఐఈవో ఎస్.నీలావతి దేవిని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కోటేశ్వరమ్మ, శివకుమారి, శైలజాకుమారి, శ్రీనివాసరావు, రవి, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు లేకుండా సేవలందించడం అభినందనీయం



ఫార్మసిస్టు దంపతులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

ముప్పాళ్ల: వైద్యశాలకు వచ్చే వారి పట్ల వైద్య సిబ్బంది ప్రేమతో మాట్లాడితే మంచి ఆదరణ లభిస్తుందని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టు బి.రాజ్యలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో హనుమకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి గీతాంజలి హాజరయ్యారు. డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ వైద్య వృత్తిలో 30 ఏళ్ల పాటు ఎలాంటి ఆరోపణలు లేకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ ప్రవీణ్, సూపర్‌వైజర్లు పీటర్‌డేమియాన్, జోస్పిన్‌రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత పల్నాడే టార్గెట్

- ప్రజలు ఇళ్లల్లో ఉండి పోలీస్ వారికి సహకరించండి
- దేశ వ్యాప్తంగా పల్నాడుకు చెడ్డ పేరు వచ్చింది
- పాత ఫ్యాక్షన్ మరలా తీసుకురావాలని చూస్తున్నారు
- ఎవరు చెప్పినా గొడవలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తాం
- ప్రశాంత కౌంటింగ్‌కు ప్రజలు సహకరించాలి
- పోలీస్ వారు విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి
- నేటి నుంచి 5వ తేదీ వరకు షాపులు మూసివేసి సహకరించాలి
- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్



పిడుగురాళ్ల పట్టణంలో పోలీస్ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్

పిడుగురాళ్ల: ప్రశాంత పల్నాడును టార్గెట్‌గా పోలీసులు, ప్రజలు పెట్టుకుందామని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్‌ను సుమారు 500 మంది సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బందితో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు ప్రాంతం పేరు దేశ వ్యాప్తంగా బాగా వినిపించిందన్నారు. కానీ ఈ సారి కౌంటింగ్ సమయంలో మనమంతా ప్రశాంతంగా ఇంటికే పరిమితమై ప్రశాంత పల్నాడును చూపించి మరలా మన పల్నాడును దేశ వ్యాప్తంగా ప్రశాంత పల్నాడుగా మార్చినట్లు చూపించాలన్నారు. చాలా మంది సార్వత్రిక ఎన్నికల సమయంలో గొడవలు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అంతే కాకుండా మన పల్నాడు ప్రాంతంలోని జైళ్లు సరిపోకపోవటంతో వారందరినీ రాజమండ్రి, నెల్లూరు వంటి ప్రాంతాలకు పంపించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి గొడవల్లో పాల్గొనని వారు కూడా గొడవలకు దిగారని, అలాంటి వారిపై కూడా రౌడీ షీట్ ఓపెన్ చేయటం జరిగిందన్నారు. చదువుకునే విద్యార్థులు, మైనర్లు కూడా గొడవల్లో పాల్గొంటున్నారని, దాని వలన వారికి ఉద్యోగాలు, వేరే ప్రాంతాలకు వెళ్లేందుకు వీసాలు రాక నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గొడవలకు పాల్పడినట్లు తెలిస్తే ఎవరు రికమండ్ చేసినా వారిని వదిలిపెట్టే ప్రసక్తి ఉండదన్నారు. ప్రజలు కూడా ఎవరి వద్దనైనా రాడ్లు దాచిపెట్టినట్లు, బాంబులు తయారు చేస్తున్నట్లు, బాటిల్లో పెట్రోల్ నింపినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని తెలియజేశారు. అంతేకాకుండా కొత్త వ్యక్తులు మీ ప్రాంతంలోకి వచ్చినట్లు తెలిస్తే వెంటనే తెలియజేస్తే వారిని కఠినంగా శిక్షించటం జరుగుతుందన్నారు. వ్యాపారస్తులు కూడా ఈ నెల 1వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 5వ తేదీ వరకు షాపులు మూసివేయాలని, లేని పక్షంలో కఠినంగా శిక్షించటం జరుగుతుందన్నారు. తదుపరి ఆదేశాల ప్రకారం షాపులు తెరుచుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ఫలితాల రోజు ఎవరు కూడా బాణసంచా కాల్చటం, ర్యాలీలు వంటివి చేయరాదని ఆమె పేర్కొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించండి

పోలీస్ వారు కూడా అధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యం చేయాలని, ఎవరైనా గొడవలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహించిన వారికి అవార్డులు కూడా ఇవ్వటం జరుగుతుందని, సక్రమంగా నిర్వహించని వారిని సస్పెండ్ చేయటం కూడా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్పీడీఆర్‌సీ రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

పల్నాడు ప్రతిష్ట కాపాడాలి



దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లోని సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గార్గ్

దాచేపల్లి : ఎన్నికల సమయంలో మంట కలిసిన పల్నాడు ప్రతిష్ట తిరిగి కాపాడాల్సిన బాధ్యత పల్నాడు ప్రజలపై ఉందని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో ఎన్నికల సందర్భంగా నమోదు అయిన కేసుల్లో, బైండోవర్ కేసుల్లో ఉన్న వ్యక్తులతో సమావేశం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మలికా గార్గ్ మాట్లాడుతూ పల్నాడు అంటే దేశ వ్యాప్తంగా మంచి పేరు ఉందని విన్నామని, కానీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణల్లో ఆ పేరంతా ఖరాబ్ అయ్యిందన్నారు. ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని, 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, అతిక్రమించితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎన్నికల్లో గొడవలు జరిగిన తరువాత రేపు అధికారంలోకి వస్తే మా నాయకుడు చెబితే తీసేస్తారని కొంత మంది అభిప్రాయ పడుతున్నారని, నేను ఎవరి మాట వినను.. తప్పు చేస్తే ఎవరినైనా వదిలిపెట్టనని చెప్పారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కుని కుటుంబానికి దూరంగా ఉండవద్దని, శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. లేదు కాదు అంటే మాత్రం పోలీసులు తీసుకోవాల్సిన చర్యలు చట్ట ప్రకారం కఠినంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. అనంతరం దాచేపల్లి లైబ్రరీ సెంటర్‌లో ప్రజలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, జగదీష్ నాయక్, సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి కోళ్లూరి ప్రసన్నాంజనేయుని జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంత్యుత్సవాలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో ఒకటిగా ఈ ఆలయం ఉంది. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కోళ్లూరు నుంచి గత పది సంవత్సరాల క్రితం స్వామి వారిని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు తరలించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా స్వామి వారి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు రామ నామ సంకీర్తనతో పూజ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. 7 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దీక్ష స్వాములకు ఇరుముడి కార్యక్రమం, సాయంత్రం నాలుగు గంటలకు కోలాటం, 6 గంటలకు వైఖానస శాస్త్రానుసారంగా సువర్చల సహిత ప్రసన్నాంజనేయ స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ తేదీన ఉదయం సుప్రభాత సేవ, ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగము, కోలాట కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. 3వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

నకరికల్లు: పొలంలో పనిచేసుకుంటున్న మహిళ మెడలోని బంగారు గొలుసు గుర్తు తెలియని దుండగుడు అపహరించాడు. ఈ ఘటన మండలంలోని నర్సింగపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాదం రమణమ్మ అనే మహిళ సాయంత్రం పొలంలో గడ్డి కోసుకుంటుంది. గుర్తు తెలియని యువకుడు ఆమె వద్దకు వచ్చి కత్తితో బెదిరించి మెడలోని 3.5 సవర్ల బంగారు నాంతాడును లాక్కున్నాడు. రోడ్డుపై మరొక వ్యక్తి ద్విచక్ర వాహనంపై సిద్ధంగా ఉండగా ఇద్దరూ కలిసి పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.రాంబాబు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరమ్మ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉపసర్తి కోటేశ్వరమ్మను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన జెడ్ఎస్ రామచంద్రరావు శుక్రవారం పదవీవిరమణ చేశారు. దీంతో సీనియర్ ఫిజిక్స్ అధ్యాపకురాలైన ఉపసర్తి కోటేశ్వరమ్మకు ప్రిన్సిపాల్‌గా అవకాశం కల్పించారు. శనివారం ఆమె ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



సత్తెనపల్లి: తెలుగు సినీ చిత్ర రంగంలో సూపర్ స్టార్ కృష్ణ ధైర్యసాహసాలకు ప్రతీక అని కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు చందలూరి రంగా అన్నారు. పట్టణంలోని కార్తీక్ రెసిడెన్సీలో సూపర్ స్టార్ కృష్ణ జయంతిని కృష్ణ, మహేష్ బాబు అభిమానులు సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. న్యాయవాది సుబ్బారెడ్డి మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. తెలుగు చిత్ర పరిశ్రమకు మొట్టమొదటి సినిమా స్కోప్ కలర్ చిత్రాలను కృష్ణ పరిచయం చేశారన్నారు. ఉమ్మడి ఏపీలో తెలుగు సినీ పరిశ్రమ నిలదొక్కుకునేందుకు కృషి చేశారన్నారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.